సాక్షి నిజామాబాద్

సోమవారం, 22, జూలై, 2024



ఎస్‌ఎఫ్‌సీ నుంచి వేతనాలు

స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులతో పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇచ్చేందుకు పంచాయతీ రాజ్ శాఖ ఏర్పాట్లు చేసింది.

- 8లో ▸



భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి

జిల్లా వ్యాప్తంగా ఆదివారం గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
28.9 /22.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చలిగాలులు వీస్తాయి. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

చెల్లెలికి పిల్లలు లేరని బాలుడి కిడ్నాప్

- అరుణ్ అపహరణ కేసులో ఇద్దరు నిందితుల రిమాండ్

ఖలీల్‌వాడి: జీజీహెచ్‌లో మూడేళ్ల బాలుడి కిడ్నాప్ కేసులో కొత్త విషయం వెలుగుచూసింది. శనివారం తెల్లవారు జామున బాలుడి కిడ్నాప్ కాగా.. ఒకటో టౌన్ పోలీసులు రంగంలోకి దిగి సాయంత్రం వరకు కేసును ఛేదించిన విషయం తెలిసిందే. కేసులో నిందితులిద్దరిని పోలీసులు ఆదివారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల విచారణలో కొత్త విషయం తెలిసింది. నిందితుల్లో ఒకరైన అద్నాన్ చెల్లెలుకు పిల్లలు లేకపోవడంతో బాలుడిని ఎత్తికెళ్లినట్లు వారు తెలిపారు. అద్నాన్ చెల్లెకు జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన ఓ వ్యక్తితో పెళ్లయ్యింది. అయితే వారికి పిల్లలు లేకపోవడంతో మానసికంగా ఆవేదన చెందడంతో బాలుడి ఎత్తికెళ్లి ఇద్దామనే ఆలోచన వచ్చింది. దీంతో తన స్నేహితుడు మొబిన్ సహకారంతో బాలుడిని అపహరించి తీసుకెళ్లి మెట్‌పల్లిలోని తన చెల్లెలుకు ఇచ్చారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆదివారం జడ్జి ఎదుట హాజరు పర్చి రిమాండ్‌కు తరలించారు.

కొత్త పట్టాదారులకు రైతుబీమా అవకాశం

- ఆగస్టు 5 వరకు గడువు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో వ్యవసాయ భూములకు కొత్తగా పట్టాపాసు పుస్తకాలు పొందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. ఈ ఏడాది జూన్ 28వ తేదీ వరకు పట్టాలు పొందిన వారు మాత్రమే బీమాకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం ఆగస్టు 5 వరకు గడువు ఉందని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. అయితే, 1965 ఆగస్టు 14 నుంచి 2006 ఆగస్టు 14 వరకు పుట్టిన రైతులే బీమాకు అర్హులన్నారు. బీమాకు రైతుపట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డు దరఖాస్తుకు జతచేయాలని, దరఖాస్తుపై స్థానిక ఏఈవో సంతకం ఉండాలన్నారు. అదే విధంగా గతంలోనే బీమాకు దరఖాస్తు చేసుకున్న రైతులు బీమాలో మార్పుచేర్పులకు ఈ నెల 30 వరకు అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

బోధన్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా శ్రీనివాస్

బోధన్ టౌన్: బోధన్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెట్‌గా శ్రీనివాస్ బదిలీపై వచ్చారు. ఆయన బాన్సువాడ ఆస్పత్రి నుంచి ఇక్కడికి వచ్చారు. బోధన్ ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాహూల్, ఆర్‌ఎంవో రహీం, డాక్టర్ బల్వీందర్ సింగ్, డాక్టర్ అమృత్ రాంరెడ్డి ఇప్పటికే బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.

ఖర్గేకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ



ఖలీల్‌వాడి: ఏఐసీసీ అధ్యక్షుడు, ఎంపీ మల్లికార్జునఖర్గేకు ఆదివారం న్యూఢిల్లీలో ఆయన నివాసంలో కలిసి ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఖర్గే ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

విజృంభించిన చికున్ గున్యా

బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండలం బోర్లం క్యాంపులో ప్రజలు విషజ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రజ్వరం, కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులతో అవస్థలు పడుతున్నారు. యువకులు, నడివయస్కులు సైతం కీళ్లనొప్పులతో బాధపడుతున్నారు. గ్రామంలోని పీఎంపీల వద్ద వైద్యం చేయించుకున్నా.. తగ్గకపోవడంతో బాన్సువాడకు పరుగులు పెడుతున్నారు. బాన్సువాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రక్తపరీక్షలు చేసుకోగా సుమారు 10 మందికి చికున్ గున్యా నిర్ధారణ అయింది. వైద్యుడి సూచన మేరకు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు.

సాగుకు వరుణుడి సాయం

- జిల్లాలో జోరుగా పొలం పనులు
- వరినాట్లకు ఊతమిచ్చిన వర్షాలు
- వారం రోజుల్లో లక్ష ఎకరాల్లో పడిన నాట్లు
- బిజీబిజీగా రైతన్నలు



అలుగు పారుతున్న బోధన్‌లోని బెల్లాల్ చెరువు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలు పొలం పనులకు ఊతమిచ్చాయి. నెమ్మదించిన వరిసాగు వరుణుడి సాయంతో ఒక్కసారిగా ఊపందుకుంది. ఇదే సరైన సమయం కావడంతో రైతులు ట్రాక్టర్లతో పొలాలను దమ్ము చేసి చకచక వరినాట్లు వేస్తున్నారు. గడిచిన వారం రోజుల్లో లక్ష ఎకరాల్లో నాట్లు పడితే, అందులో 50 వేల ఎకరాలు ఈ మూడు రోజుల్లోనే పడ్డాయి. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో నాట్లను త్వరగా పూర్తి చేయాలని రైతులు భావిస్తున్నారు. దీంతో సమయాన్నంతా పొలం పనులకే కేటాయిస్తున్నారు. కూలీలకు కూడా పని లభించడంతో తగినంత ఉపాధి దొరుకుతోంది. మరోవైపు సాగవుతున్న మక్క, సోయా పంటలకు వర్షాలు చాలావరకు మేలు చేస్తున్నాయి. అయితే, వర్షాలు ఇలాగే ఆగ కుండా కురిస్తే ఆరుతడి పంటలకు కొంత ఇబ్బంది కలిగే అవకాశముంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరిపంట 4.30లక్షల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. వారం, పది రోజుల కిందట 1.71లక్షల ఎకరాల్లో ఉన్న వరిసాగు వర్షాల రాకతో ఏకంగా 2.75లక్షల ఎకరాలకు చేరింది. అయితే, రెండు రోజులుగా కురుస్తున్న వానలకు కొన్నిచోట్ల వరి నీటమునిగింది. జిల్లాలో ఎక్కడ కూడా పంటనష్టం జరగలేదని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ వెల్లడించారు. పొలాల్లో చేరిన నీటిని తొలగిస్తే సరిపోతుందని ఆయన రైతులకు సూచించారు.

నిండుతున్న చెరువులు, పారుతున్న వాగులు

జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వానలకు జిల్లాలోని చెరువులు, జలాశయాలు నిండుకుంటున్నాయి. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వరదనీటికి అలుగులు, వాగులు, ఒర్రెలు కూడా పారుతున్నాయి. ఎడపల్లి మండలం అంబెం వాగు, భీమ్‌గల్‌లో కప్పలవాగు, రుద్రూర్ మండలంలో బొప్పాపూర్ వాగు, అలాగే ఆలూరు, ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ మండలాల్లో కూడా పలు వాగులు ప్రవహిస్తున్నాయి. ఆదివారం కూడా జిల్లాలో వర్షం కురిసింది. అత్యధికంగా కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్‌లో 25.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ధర్పల్లిలో 10.8, ఆలూరు మండలం మచ్చర్లలో 7.0, ఇందల్వాయి మండలం గన్నారంలో 7.3, కోటగిరిలో 5.3, డిచ్‌పల్లిలో 4.8, సిరికొండ మండలం తూంపల్లిలో 4.1, మోపాల్ మండలం మంచిప్పలో 4.0, మాక్లూర్ మండలం మదనపల్లిలో 3.5, రుద్రూర్‌లో 3.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. ముసురు వానకు ఇప్పటి వరకు జిల్లాలో ఎక్కడ కూడా ఆస్తినష్టం వాటిల్లలేదు.

వేంపల్లిలో రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం..

ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామంలో రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. 143 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

గోదావరికి పెరుగుతున్న వరద



కందకుర్తి త్రివేణి సంగమంలో వరద ప్రవాహం

రెంజల్(బోధన్): గోదావరి నదికి వరద నీటి ప్రవాహం పెరుగుతోంది. ఎగువన గల మహారాష్ట్రతో పాటు స్థానికంగా కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద నీరు వచ్చి చేరుతోంది. పుష్కరక్షేత్రంలో గల నదిలోని పురాతన శివాలయం వరకు నీరు వచ్చి చేరింది. నది పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెంజల్ ఎస్సై సాయన్న స్థానికులను అప్రమత్తం చేశారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద నీరు



ఎస్సారెస్పీలో ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి 18,518 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 262 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80 టీఎంసీలు) కాగా ఆదివారం రాత్రి వరకు 1067.90 అడుగుల(20టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.



డొంకేశ్వర్ మండలంలో వరి నాటేందుకు పొలాన్ని ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

చెరువులకు జలకళ

- మూడు రోజులుగా కురుస్తున్న వానలు
- అలుగు పారుతున్న 58 చెరువులు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో గత మూడురోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు జలకళను సంతరించుకున్నాయి. దీంతో వాగులు, చెరువుల్లో భారీగా వరద నీరు చేరుకుంటుంది. జిల్లాలో ఇప్పటికే 58 చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి.. మిగతావి 75శాతంపైగా చెరువులు నీరు వచ్చి చేరుతుంది.. మరో రెండు రోజుల పాటు ఇలాగే వర్షాలు కురిస్తే అన్ని చెరువులు నిండుకునే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

నియోజకవర్గాల వారీగా	చెరువులు	0-25 శాతం నిండినవి	25-50 శాతం నిండినవి	50-75 శాతం నిండినవి	75-100 శాతం నిండినవి	అలుగులు పారుతున్నవి
నిజామాబాద్	324	217	90	10	03	04
బోధన్	182	-	33	43	59	47
ఆర్మూర్	198	74	97	18	06	03
బాల్కొండ	292	58	37	122	71	04
మొత్తం	996	349	257	193	139	58



బోధన్ మండలం నాగన్‌పల్లిలో నిండుగా ప్రవహిస్తున్న పసుపు వాగు




బాల్కొండ మండలం కొత్తపల్లి శివారులో పొలాల్లోకి చేరిన వరద నీరు



మోర్తాడ్ మండలంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న పెద్దవాగు

స్థానికేతరులకూ 'టాడి' లైసెన్సులు..!



మూడో డిపోలో సభ్యులుగా సాయాగౌడ్, చరణ్‌గౌడ్





సాయాగౌడ్ స్థానంలో మరొకరితో టాడి టాపర్ పరీక్ష, చరణ్‌గౌడ్ స్థానంలో మరొకరితో..

- మూడో డిపోలో ఇతర జిల్లాల వారికి టాడి టాపర్ సభ్యత్వం
- చెట్లు ఎక్కకుండానే గీత కార్మికుల లైసెన్స్‌లు
- సభ్యుల బంధువులకే అవకాశం
- 'ఆధార్'లో మార్పు చేశారని ఆరోపణలు

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో కల్లుడిపోలో నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. స్థానికేతరులను సభ్యులుగా నియమించుకుంటున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. న్యాల్‌కల్ రోడ్డులోని భవానీ టాడి టాపర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో మూడో కల్లుడిపోను నిర్వహిస్తున్నారు. సాధారణంగా సొసైటీ సభ్యులుగా ఉండాలంటే స్థానికంగా నివాసం ఉండాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఎక్సైజ్ అధికారులు, గీత కార్మికులు చెట్లెక్కి కల్లు గీస్తారా లేదా అనే పరీక్ష నిర్వహిస్తారు. అర్హత సాధించిన వారికే గీత కార్మికులుగా గుర్తింపు కార్డులిస్తారు. కానీ అలా కాకుండా ఇతర జిల్లాలకు చెందిన వారిని, జిల్లాలోని ఇతర ప్రాంతాలకు చెందిన వారిని డిపోలో టాడిటాపర్స్‌గా ఉన్నారు. నిబంధనల ప్రకారం టాడిటాపర్స్ 50 ఏళ్ల వయస్సు ఉంటే తెలంగాణ ప్రభుత్వం పెన్షన్ అందిస్తుంది. కానీ 50 ఏళ్లకు పైడిన వారిని సైతం టాపర్లుగా ఎలా కొనసాగిస్తారనే ప్రశ్నాలు తలెత్తుతున్నాయి. ఇలా నిబంధనలకు విరుద్ధంగా సభ్యత్వం పొందుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

ఇతర ప్రాంతాల్లోనూ లైసెన్సులు ఉన్నా..

మూడో కల్లు డిపోలోని కో–ఆపరేటివ్ సొసైటీలో జిల్లాలోని భీమ్‌గల్, సిరిసిల్ల, నల్గొండ, నిర్మల్ ప్రాంతాలకు చెందిన వారు సభ్యులుగా ఉన్నారు. వీరందరూ సొసైటీలో సభ్యులకు బంధువులు కావడం విశేషం. మూడో డిపోలో టాడిట్యాపర్లుగా ఉన్నవారికి వారు వారి స్వస్థలాల్లోనూ గీత కార్మికులుగా గుర్తింపు కార్డులు పొందారు. భీమ్‌గల్ మండలంలోని మూడు గ్రామాలకు చెందిన వారు ఇందులో టాడిటాపర్లుగా ఉన్నారు. నిజామాబాద్ నగరానికి చెందిన వారు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న గౌడ కులస్తుల కాకుండా స్థానికేతరులకు ఇవ్వడంపై గీత కార్మిక సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

ఎక్సైజ్ అధికారులపై ఆరోపణలు

మూడో కల్లుడిపోలో సభ్యులుగా ఉన్నవారు ఆధార్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేసి టాడిటాపర్లుగా గుర్తింపు పొందారనే ఆరోపణలున్నాయి. ఈ డిపోలో ఉన్న సభ్యులను స్థానికంగా ఉండేవారి వివరాలను సేకరించాల్సి ఉన్నా నిర్వాహకులతో ఎక్సైజ్ అధికారులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు ఆధార్ కార్డులతో పాటు స్థానికులపై ఆరా తీయాలని పలువురు కోరుతున్నారు.

గల్ఫ్‌లో ఉన్నవారికి కూడా..

నగరంలోని ఎక్సైజ్ కార్యాలయంలో టాడిటాపర్ల కోసం మూడో డిపోలోని పలువురు సభ్యులతో పాటు ఇతరులు కొంత మంది టాడి ట్యాపర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. సెప్టెంబర్ 28, 2007లో మూడో డిపో ఏర్పాటు కోసం టాడి టాపర్లకు మాక్లూర్ మండలంలోని సింగంపల్లిలోని ఓ ఈత వనంలో పరీక్షలు నిర్వహించారు. అయితే ఇందులో దరఖాస్తులు చేస్తుకున్న వారి పేరిట ఇతరులు చెట్లు ఎక్కారు. గుర్తింపు కార్డులు మాత్రం దరఖాస్తు దారులకు ఇచ్చారు. అయితే డిపో ఏర్పాటు వాయిదా పడుతూ వచ్చింది. చివరకు 2016 ఏర్పాటు చేశారు. అయితే ట్యాపర్ల కోసం మళ్లీ పరీక్షలు నిర్వహించకుండా పాత వారికే గుర్తింపు పత్రాలు ఇచ్చారు. వీటిపై పలుమార్లు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించలేదు. గల్ఫ్ దేశంలో ఉన్నవారికి కూడా గల్ఫ్‌లో ఉండగానే వారికి టాడిటాపర్లుగా గుర్తింపుకార్డులు అందించారు. 15 రోజుల క్రితం నగరానికి చెందిన ఒకరు మూడో డిపోకు చెందిన టాడిటాపర్ల పరీక్షకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్‌కు సమాచారంహక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకుంటే నిబంధనలు ప్రకారం ఇవ్వరాదని చెప్పి నోటీసు ఇచ్చినట్లు తెలుస్తోంది.

దాశరథి జీవితం స్ఫూర్తిదాయకం



నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గోరటి వెంకన్న

- ఎమ్మెల్సీ, ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న

నిజామాబాద్ అర్బన్: మహాకవి దాశరథి కృష్ణమాచార్య జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ, ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న అన్నారు. దాశరథి 99వ జయంతి కార్యక్రమం ఆదివారం నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గోరటి వెంకన్న మాట్లాడుతూ.. కృష్ణమాచార్య నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. రజాకార్ల అకృత్యాలపై అనేక రచనలు చేశారని పేర్కొన్నారు. వందలాది సినిమాలకు పాటలు రాశారని గుర్తు చేశారు. తన రచనలకు ఎన్నో అవార్డులు అందుకున్న దాశరథి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆస్థాన కవిగా కూడా పనిచేశారని చెప్పారు. ప్రజల కష్టాలపై కవితలు, రచనలు చేయడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. అనంతరం కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కవి దారం గంగాధర్, దాసు, ఇందూరు సాయిబాబా, శ్రీనివాస్ ఆర్య, చంద్రశేఖర్, కళాకారులు అష్టగంగాధర్, ఆర్టీసీ శ్రీనివాస్, లయోల సాయిలు, సురేష్ బాబు, అబ్దుల్, రంజిత్, కామినేని రేణుక పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

వేల్పూర్: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో ఆదివారం రైతులు నిర్వహించిన పంట రుణమాఫీ సంబరాల్లో పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 2లక్షల పంట రుణాలను మాఫీ చేస్తోందన్నారు. వచ్చేనెల 15 వరకు అర్హులైన రైతులందరికీ రెండు లక్షల పంట రుణాలను మాఫీ చేస్తుందన్నారు. పంట రుణాల మాఫీపై ప్రతి పక్షాలు రాద్ధాంతం చేయడం తగదన్నారు. గత ప్రభుత్వం పంట రుణాలు మాఫీ చేస్తామని చేయకుండా రైతులను మోసం చేసిందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అలా మోసగించకుండా ఏకకాలంలో రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, స్థానిక నాయకులు గట్టువుతల నర్సారెడ్డి, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ గంగారెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.



పచ్చలనడ్కుడలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అన్వేష్‌రెడ్డి

పోలీసుల అదుపులో యూనియన్ బ్యాంక్ మేనేజర్?

- హైదరాబాద్‌లో పట్టుకున్న ప్రత్యేక బృందం
- నిజామాబాద్‌కు తరలింపు
- కొనసాగుతున్న విచారణ

ఖలీల్‌వాడి: ఖాతాదారుల నుంచి డబ్బులు కాజేసిన బ్యాంక్ మేనేజర్ అజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నగరంలోని పెద్దబజార్ యూనియన్ బ్యాంకులో ఖాతాదారులను మచ్చిక చేసుకొని వారి రుణాలను, డబ్బులను తీసుకొని బ్యాంక్ మేనేజర్ పరారైన విషయం తెలిసిందే. కేసులో బ్యాంక్ మేనేజర్‌పై ఇప్పటి వరకు 26 మంది నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీస్‌శాఖ మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టింది. ఒక పోలీసు బృందం హైదరాబాద్‌లో నాలుగు రోజులుగా మకాం వేసి మేనేజర్ అజయ్ ఆచూకీకి కోసం వాకబు చేశారు. దీంతోపాటు సాంకేతిక రంగాన్ని ఆధారం చేసుకొని కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాల ద్వారా అజయ్ ఎక్కడ ఉన్నారనే దానిపై ఆరా తీశారు. పక్కా సమాచారం మేరకు ఆదివారం హైదరాబాద్‌లో బ్యాంక్ మేనేజర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. శనివారం రాత్రే అదుపులోకి తీసుకుని బ్యాంకులో ఖాతాదారులకు సంబంధించిన లావాదేవీలపై విచారణ చేపట్టినట్లు తెలిసింది.



మేనేజర్ అజయ్

క్లుప్తంగా

10కే రన్ బ్రాండ్ అంబాసిడర్‌గా వేల్పూర్‌వాసి



వేల్పూర్: తెలంగాణ హిస్టారికల్ 10కే రన్‌కు తాను బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికైనట్లు మండల కేంద్రానికి చెందిన గుగ్గిలం అశోక్ ఆదివారం తెలిపారు. వచ్చేనెల 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 10కే రన్‌లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు రన్నర్‌లు పాల్గొంటారని పేర్కొన్నారు. తనను బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేసి హైదరాబాద్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. రవాణా శాఖలో హోంగార్డుగా కామారెడ్డిలో విధులు నిర్వర్తిస్తున్న అశోక్.. గత పదేళ్లుగా అనేక రాష్ట్రాల్లో నిర్వహించిన రన్నింగ్ పోటీల్లో పాల్గొని విజయాలు సాధించారు. అశోక్ ఎంపికపై వేల్పూర్ గ్రామస్తులతోపాటు అతడి స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా జైలు సూపరింటెండెంట్‌గా ఆనంద్

ఖలీల్‌వాడి: జిల్లా జైలు సూపరింటెండెంట్‌గా ఆనంద్ నియమితులయ్యారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు బదిలీపై వచ్చిన ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సూపరింటెండెంట్ ప్రమోద్ నల్గొండకు వెళ్లారు. ఐదేళ్లపాటు పని చేసిన ప్రమోద్ జిల్లా జైలులో సెంట్రల్ జైలు ఏర్పాటుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు.

ఎస్‌ఎఫ్‌సీ నుంచి జీపీ కార్మికులకు వేతనాలు

- జిల్లాలోని 1,532 మందికి రూ.1.87 కోట్లు విడుదల
- నిధుల సర్దుబాటుపై అధికారుల దృష్టి



మోర్తాడ్(బాల్కొండ): స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులతో గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించేలా పంచాయతీరాజ్ శాఖ ఏర్పాట్లు చేసింది. పంచాయతీల ఆదాయం తగ్గిపోవడంతో కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించే పరిస్థితి లేదు. చిన్న పంచాయతీల్లో కార్మికులకు ఐదారు నెలలుగా వేతనాలు చెల్లించకపోగా, మేజర్ పంచాయతీల్లో ఒకటిరెండు నెలలకు సంబంధించి బకాయిలు ఉన్నాయి. పన్ను వసూళ్ల ద్వారా వచ్చే ఆదాయం అంతంత మాత్రం ఉండటంతో పంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులతో కేవలం అభివృద్ధి పనులు మాత్రమే చేపట్టాల్సి ఉంది. దీంతో పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించే మరో మార్గం లేకపోవడంతో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసే నిధుల్లో నుంచి వేతనాలు చెల్లించాలని గతంలోనే ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలోని 530 పంచాయతీలకు ప్రతి నెలా 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.10.30 కోట్ల నిధులు మంజూరి చేస్తే మ్యాచింగ్ గ్రాంట్‌గా ఎస్‌ఎఫ్‌సీ ద్వారా మరో రూ.10.30 కోట్ల నిధులు విడుదల కావాల్సి ఉంది. గతంలో కొన్ని నెలల పాటు నిధుల విడుదల సాఫీగానే సాగింది. ప్రభుత్వ ఖజానాలో నిధులు నిండుకోవడంతో ఎస్‌ఎఫ్‌సీ నిధుల విడుదలకు బ్రేక్ పడింది. గ్రామ పంచాయతీ కార్మికుల ఆందోళనలతో స్పందించిన ప్రభుత్వం ఎస్‌ఎఫ్‌సీ ద్వారా నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. మొత్తం 1,532 మంది కార్మికుల కోసం రూ.1,87,43,500 నిధులు విడుదల కాగా, ఆయా పంచాయతీల్లోని జనాభా ప్రకారం అధికారులు సర్దుబాటు చేసి, ఆ తరువాత బకాయి వేతనాలను చెల్లించనున్నారు. అయితే, ఎస్‌ఎఫ్‌సీ నిధులను అభివృద్ధి పనులకు కాకుండా పంచాయతీ కార్మికుల వేతనాల కోసం వినియోగిస్తే నిధుల కొరత ఏర్పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం వేతనాల కోసం ప్రత్యేక గ్రాంట్‌ను కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తాం

ఎస్‌ఎఫ్‌సీ నిధులతో పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాకు విడుదలైన నిధులను పంచాయతీల్లోని జనాభా ఆధారంగా కేటాయించి వేతనాలు అందించేలా చూస్తాం. బకాయి వేతనాలు చెల్లిస్తే కార్మికులకు ఊరట లభిస్తుంది.

– తరుణ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి

విద్యుత్ అధికారుల విచిత్ర ధోరణి

- నకిలీ సర్టిఫికెట్లు పెట్టిన ఆర్టిజన్‌పై చర్యలు కరువు
- ఎఫ్‌ఐఆర్ లేదు.. రికవరీ చేయలేదు
- ఆర్మూర్ డివిజన్‌లో ఇష్టారాజ్యం

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ శాఖ అధికారులు విచిత్ర ధోరణిని అవలంబిస్తున్నారు. సబ్‌స్టేషన్‌లలో గతంలో కాంట్రాక్టర్ ద్వారా ఐటీఐ(ఎలక్ట్రీషియన్) చేసిన వారికి ఆపరేటర్లుగా ఉద్యోగాలు కల్పించి వారి ద్వారానే వేతనాలు చెల్లించేవారు. అయితే, 2017లో ఆపరేటర్లను ఆర్టిజన్లుగా మార్చి విద్యుత్‌శాఖలో విలీనం చేసి జీతాలు పెంచిన విషయం తెలిసిందే. ఫేక్ సర్టిఫికెట్లతో విధుల్లో చేరినట్లు తెలిసినా, పట్టుబడినా వారిపై సంబంధిత డివిజన్ ఇంజనీర్లు క్రిమినల్ కేసులు నమోదు చేసి రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా ఆర్మూర్ డివిజన్‌లో 156మంది ఆర్టిజన్‌ల సర్టిఫికెట్లను పరిశీలనకోసం ఎంప్లాయిమెంట్ జాయింట్ డైరెక్టర్‌కు పంపించారు. సర్టిఫికెట్లను పరిశీలించిన అధికారులు.. మానాల సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్టర్ ద్వారా ఉద్యోగంలో చేరిన గుగ్లోత్ మదన్‌లాల్‌ది ఫేక్ సర్టిఫికెట్ అని 2023 ఏప్రిల్‌లో తేల్చారు. అయినప్పటికీ సదరు ఆర్టిజన్ సుమారు ఏడాదిపాటు విధులు నిర్వర్తిస్తూ ప్రతినెలా రూ.30వేలకు పైగా జీతం తీసుకున్నారు. ఉద్యోగులు డీఈపై ఒత్తిడి తీసుకురాగా 'నేను చూసుకుంటా.. ఎస్‌ఈకి లేఖ రాశా' అని చెప్పి తీరా.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి విధులకు రావొద్దని ఆర్టిజన్‌ను డీఈ హరిచంద్ నాయక్ ఆదేశించి చేతులుదులుపుకున్నారు. ఆర్టిజన్ ఫేక్‌సర్టిఫికెట్లతో ఉద్యోగం చేశాడని తేలినా డీఈ ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, దానికి కింది స్థాయి ఉద్యోగులను బాధ్యులను చేసే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

విద్యార్థుల రక్షణ కోసం సోలార్ ఫెన్సింగ్

బీబీపేట: మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువ కావడంతో టీఎస్‌ఎన్‌ఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పునర్నిర్మాణ దాత తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి పాఠశాల ప్రహరీ చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు ముందుకొచ్చారు. కోతుల దాడిలో విద్యార్థులు గాయపడడంతో సమస్యను పాఠశాల హెచ్‌ఎం రవీంద్రరెడ్డి సుభాష్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయారు. దీంతో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫెన్సింగ్ ఏర్పాటుతో విద్యార్థులకు ముప్పు తప్పనుంది.

రాష్ట్రస్థాయి తైక్వాండోకు 40 మంది ఎంపిక



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు 40మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని మాధవనగర్‌లో ఉన్న బీఎల్‌ఎన్ గార్డెన్‌లో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ఆదివారం తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాజిరెడ్డి జగన్, ప్రధాన కార్యదర్శి, కోచ్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో పర్యవేక్షణలో నిర్వహించారు. మొత్తం 70 మంది క్రీడాకారులు పాల్గొనగా 40 మంది గోల్డ్ మెడల్, 20మంది సిల్వర్, 10 మంది బ్రాంజ్ మెడల్స్ సాధించారు. గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులు ఈ నెల 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయికి పోటీల్లో పాల్గొంటారని కోచ్ మనోజ్ తెలిపారు. రెఫరీలుగా నేహ, గయాజ్ వ్యవహరించగా, అసోసియేషన్ కోశాధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్

కామారెడ్డి అర్బన్ : సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో చేతితో పెయింటింగ్ చేసే చిత్రకారులకు ఉపాధి లేకుండా పోయిందని పెయింటింగ్ తెలంగాణ ఆర్టిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్ అన్నారు. ఆదివారం పెయింటింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా శాఖ సమావేశం స్థానిక గంజ్ ధర్మశాలలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు చిత్రకళకారులు ఉపాధిలేక కొట్టుమిట్టాడుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కే.రమేష్, గౌరవ అధ్యక్షుడుగా సయ్యద్ తహీర్, ఉపాధ్యక్షుడుగా ఎం.రాము, కారదర్శిగా రవి, సహాయ కార్యదర్శిగా పి.లక్ష్మణ్, కోశాధికారిగా ఎం.రాజు, సలహాదారుగా ఎస్.శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు.

ఏవో, ఏఈవోల వద్ద రుణమాఫీ సమాచారం

- ప్రత్యేక లాగిన్ ఇచ్చిన ప్రభుత్వం
- రైతుల ఆధార్ ఆధారంగా 'మాఫీ' సమాచారం వెల్లడి
- 'మాఫీ' వర్తించని వారు ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి



మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పంటరుణాల మాఫీ ప్రక్రియలో రైతుల సందేహాలను నివృత్తి చేసే వ్యవస్థ లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. రుణమాఫీ పొందిన రైతుల జాబితా తప్ప వ్యవసాయ శాఖ వద్ద మరే సమాచారం లేదు. రుణమాఫీ అమలు ప్రక్రియలో తాజాగా వ్యవసాయ శాఖను భాగస్వామిగా చేసిన ప్రభుత్వం.. వ్యవసాయాధికారి(ఏవో), వ్యవసాయ విస్తీర్ణ అధికారి(ఏఈవో)లకు లాగిన్ ఇచ్చింది. రైతులు తమ క్లస్టర్ ఏఈవో లేదా మండల వ్యవసాయాధికారిని కలిసి ఆధార్ నంబర్ చెబితే రుణం మాఫీ అయ్యిందా? లేదా? అనే వివరాలను మాత్రం అందించే ఏర్పాట్లు చేశారు. ఒక వేళ రుణం మాఫీ కానిపక్షంలో ఆ సమస్యను ఎలా పరిష్కరించాలనే సమాచారం మాత్రం వ్యవసాయ శాఖ వద్ద లేదు. గతంలోనూ రుణమాఫీ కానివారి కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినా అది పూర్తి స్థాయిలో పని చేయకపోవడంతో అనేక మందికి అర్హత ఉన్నా.. రుణమాఫీ ఫలాలు దక్కలేదు. జిల్లాలో తొలి విడతలో రూ.లక్ష వరకు పంట రుణం మాఫీ చేయగా.. 44,469 మందికి రూ.226 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రెండో విడతలో రూ.1.50లక్షల వరకు, చివరి దశలో రూ.2లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం విదితమే. ఇదిలా ఉండగా, తొలి విడతలోనే రూ.లక్ష వరకు బకాయి ఉన్న అనేక మందికి పంట రుణాలు మాఫీ కానట్లు తెలుస్తోంది. తమకు రూ.లక్ష లోపు రుణం ఉన్నా.. జాబితాలో తమ పేర్లు లేవని కొంత మంది రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయానికి, బ్యాంకులకు వెళ్లి ఫిర్యాదు చేసినా ఎక్కడ కూడా సరైన సమాధానం దొరకడం లేదు. బ్యాంకుల నుంచి ప్రభుత్వం నేరుగా రైతుల వివరాలు, వారి బాకీ సమాచారాన్ని మాత్రమే సేకరించింది. రేషన్ కార్డును ఒకే కుటుంబంలోని రైతులు లబ్ధి పొందుతున్నారా లేదా అని ప్రామాణికంగా తీసుకున్నారు. ఒక్కో కుటుంబంలో ఇద్దరు ముగ్గురికి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఉన్న ఉంటే వారి కుటుంబం మొత్తానికి రూ.2లక్షల వరకు మాఫీ వర్తించాలి. కానీ ఒక్కరే కుటుంబ సభ్యుని పేరు జాబితాలో రావడం ఇతరుల పేర్లు లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రుణమాఫీ లక్ష్యం భారీగానే ఉంది. జిల్లాలోని 2,91,188 మంది రైతులకు రూ.1,790 కోట్లు మాఫీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో కేవలం 97,418 మంది రైతులకు రూ.490.72 కోట్లు మాఫీ చేశారు. ఇప్పుడు తొలి విడతలోనే తక్కువ మంది రైతులకు గతంలో కంటే కొంత మెరుగ్గానే రుణం మాఫీ చేసినా రూ.లక్ష లోపు బకాయి ఉన్నవారందరికీ లబ్ధి చేకూరలేదనే అంశం చర్చకు వచ్చింది. ఏవో, ఏఈవోలు కేవలం రుణం మాఫీ అయ్యిందా? లేదా? అనే సమాచారాన్ని మాత్రమే ఇచ్చే పరిస్థితి ఉంది. ఇలా కాకుండా రుణం మాఫీ కాకపోతే ఆ సమస్యను ఎలా పరిష్కరించాలో తెలియజెప్పే ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయడం లేదా వ్యవసాయ శాఖనే మార్గం చూపేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

లాగిన్‌లో రైతుల వివరాలు

రుణమాఫీకి సంబంధించి ఏఈవో, ఏవోల వద్ద పూర్తి సమాచారం ఉంది. వారి లాగిన్‌లోకి వెళ్లి రైతు ఆధార్ నంబర్ ఆధారంగా రైతుకు రుణమాఫీ వర్తించిందా.. లేదా.. అనే సమాచారం ఇవ్వగలరు. ఏమైనా సమస్యలు తలెత్తితే వాటిని ఎలా పరిష్కరించాలో ప్రభుత్వం ముందుముందు చర్యలు తీసుకుంటుంది కావొచ్చు.

– కాలువ మల్లయ్య, వ్యవసాయ సహాయ సంచాలకులు, భీమ్‌గల్

అ'పూర్వ' సమ్మేళనాలు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు



మాట్లాడుతున్న ఇంటెలిజెన్స్ ఎస్పీ రతన్‌కుమార్

ఎల్లారెడ్డి/బాన్సువాడ/మాచారెడ్డి: పూర్వ విద్యార్థుల సమ్మేళనాలను ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాలతోపాటు మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని వీకేవీ కన్వెన్షన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల (1982–84 బ్యాచ్) ఇంటర్మీడియెట్ పూర్వ విద్యార్థులు, బాన్సువాడ పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో (2003–04బ్యాచ్) పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలను ఏర్పాటు చేశారు. ఎల్లారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ ఇంటెలిజెన్స్ ఎస్పీ రంజన్‌రతన్‌కుమార్ హాజరై మాట్లాడారు. 40 ఏళ్ల తరువాత కలుసుకున్న స్నేహితులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులైన అడిషనల్ ఎస్పీ సంజీవరావు, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, వర్ని, ఇందల్వాయి ఎంపీడీవోలు వెంకటేశం, అనంత్‌రావు, జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ బీఎల్ శంకర్, రిజిస్ట్రార్ రవీందర్‌నాయక్ (కూకట్‌పల్లి), రాజ్‌కుమార్, రాజేందర్ నాథ్, మర్మల్ల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడలో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమ్య, శృతి, అర్చన, గౌతమి, శిరీషా, పద్మ, నిఖిల, రాజేశ్, అభినయ్, నాగార్జున, శివ కుమార్, రాకేశ్, ఉపాధ్యాయులు సుదర్శన్, అనూష, హన్మండ్లు, రమేశ్, సుంకి విజయలక్ష్మి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. చుక్కాపూర్‌ఉన్నత పాఠశాలలో 1987–88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అశోక్‌కుమార్, నరసింహారెడ్డి, కృష్ణ కుమార్, రఘుపతి, సత్యం, మంజుల, రమణ ఉన్నారు.



బాన్సువాడలోని సరస్వతి శిశుమందిర్‌లో..



చుక్కాపూర్ ఉన్నత పాఠశాలలో..

క్రైం కార్నర్

మానసికస్థితి సరిగా లేక యువతి ఆత్మహత్య

మాక్లూర్: మానసికస్థితి సరిగా లేని యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మానిక్‌బండార్ తండాల్లో ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్సై గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మానిక్‌బండార్ తండాకు చెందిన బదావత్ అమర్‌సింగ్‌కు ముగ్గురు ఆడ పిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె వివాహం కాగా, రెండో కుమార్తె గతంలో మృతి మృతి చెందింది. మూడో కుమార్తె అయిన దివ్య(20) మానసిక స్థితి సరిగా లేకపోవడంతో నిజామాబాద్‌లోని స్నేహ సొసైటీలో చేర్పించగా, అక్కడ ఉండలేని ఇంటికి వచ్చేసింది. కంటి చూపు సైతం సరిగా లేని దివ్యం ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి తండ్రి బదావత్ అమర్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని జల్దిపల్లి గ్రామ శివారులో ఆదివారం విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన తిగుల హన్మంతు రోజూలాగే గ్రామ శివారులోకి గేదెను మేతకు తీసుకెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్ తగిలి మృతి చెందిందన్నారు. మృతి చెందిన గేదె విలువ రూ.50వేలు ఉంటుందని, విద్యుత్ అధికారులు తనకు పరిహారం చెల్లించాలని బాధితుడు కోరాడు.

మొబైల్ దుకాణంలో చోరీకి యత్నం

కామారెడ్డి క్రైం: పట్టణంలోని సాందీపని జూనియర్ కళాశాల పక్కన ఉన్న హైమద్ మొబైల్ షాపులో దుండగులు శనివారం అర్ధరాత్రి చోరీకి యత్నించారు. షటర్ తాళాలు పగులగొట్టేందుకు దుండగులు విఫలయత్నం చేశారు. ఆదివారం ఉదయం దుకాణానికి వచ్చిన యజమాని నజీర్ హైమద్ తాళాలు ధ్వంసమై ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. మొబైల్ షాపు నుంచి ఎలాంటి సొత్తు చోరీకి గురికాలేదని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 10 మందిని అరెస్టు చేశారు. న్యాల్‌కల్ రోడ్డులోని లలితానగర్ ఫేస్–2లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఏసీపీ విష్ణుమూర్తి ఆదేశాల మేరకు సీఐ పురుషోత్తం సిబ్బందితో కలిసి దాడి చేశారు. 10 మందిని అదుపులోకి తీసుకొని రూ.5,200 నగదుతోపాటు 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

వేర్వేరు చోట్ల చేపల వేటకు వెళ్లి ఇద్దరి మృతి



అన్వర్ మృతదేహం

ఖలీల్‌వాడి: చేపల వేటకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందిన ఘటన నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. 80 క్వార్టర్స్ సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు అన్వర్ అనే యువకుడు ఆదివారం ఉదయం వెళ్లాడు. చేపలను వేటాడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలోపడి మునిగిపోయాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, వారు రెస్క్యూటీమ్‌ను రప్పించారు. రంగంలోకి దిగిన రెస్క్యూటీమ్ అన్వర్ మృతదేహాన్ని నీటిలో నుంచి బయటికి తీశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


సుర్బిర్యాల్‌లో..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామానికి చెందిన పల్లికొండ లక్ష్మణ్(29) చేపల వేటకు వెళ్లి వలలో చిక్కుకుని మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్మూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి టీవీటీ విభాగంలో క్లీనింగ్ సెక్షన్‌లో పని చేస్తున్న లక్ష్మణ్ శుక్రవారం విధులు ముగించుకుని గ్రామానికి వెళ్లాడు. అదే రోజు రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లిన లక్ష్మణ్ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. అయితే, ఆదివారం ఉదయం.. గ్రామ చెరువులో లక్ష్మణ్ శవమై కనిపించాడు. చేపలు వేటాడే సమయంలో వలలో చిక్కుకుని లక్ష్మణ్ మృతి చెందాడు. ఆర్మూర్ ఎస్సై అంజమ్మ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి భూదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక..

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాదికి చెందిన గాంధారి రహిత (15) గత నెల 17న పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం సాయంత్రం మృతి చెందింది. తన కూతురి మృతిపై ఎలాంటి అనుమానం లేదని, కడుపునొప్పి భరించలేక క్రిమి సంహారక మందు తాగిందని మృతురాలి తండ్రి వెంకటేశ్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు.

లిఫ్ట్ గుంతలో పడి మహిళ..



రాజేశ్వరి మృతదేహం

కామారెడ్డి క్రైం: లిఫ్ట్ కోసం తవ్విన గుంతలో పడి మహిళ మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పాల్వంచ మండలం మంథని దేవునిపల్లి గ్రామానికి చెందిన కామటి భూమయ్య, రాజేశ్వరి (55) దంపతులు కొద్ది రోజులుగా కామారెడ్డిలోని తాహెర్ గార్డెన్ వెనుక ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న భవనంలో వాచ్‌మెన్‌గా పని చేస్తూ అదే భవనంలోని మూడో అంతస్తులో ఉంటున్నారు. శనివారం రాత్రి 10.30 గంటలకు భోజనం చేసిన రాజేశ్వరి చేతులు కడుక్కోడానికి వెళ్లి భవనం పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడింది. ఆమె లిఫ్ట్ గుంతలో పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే భర్త భూమయ్యతోపాటు బంధువులు రాజేశ్వరిని బయటికి తీసినప్పటికీ ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు..



లక్ష్మణ్ గోండ (ఫైల్)

మద్నూర్(జుక్కల్): రుణమాఫీ వచ్చిందో లేదో తెలుసుకునేందుకు బ్యాంకు వెళ్లిన వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇన్‌చార్జి ఎస్సై సాయన్న, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. డోంగ్లీ మండలంలోని మొగా గ్రామానికి చెందిన లక్ష్మణ్ గోండ(60) రుణమాఫీ వివరాలు తెలుసుకునేందుకు శనివారం ఉదయం మేనూర్‌లోని సిండికేట్ బ్యాంకుకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం లక్ష్మణ్ గోండ ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆదివారం సలాబత్‌పూర్ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి చూసి లక్ష్మణ్‌గోండ మృతదేహంగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. లక్ష్మణ్ గోండ ఒంటిపై గాయాలున్నాయని, మేనూర్‌కు వెళ్తానని సలాబత్‌పూర్‌కు ఎందుకు వెళ్లాడని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ముగ్గురి అదృశ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం గూడెం గ్రామానికి చెందిన తల్లీకూతుళ్లు అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు ఆదివారం తెలిపారు. భర్తతో గొడవల కారణంగా బీబీపేట మండలం ఇస్సానగర్‌కు చెందిన నల్లకుంట స్వరూప, కుమార్తె తేజస్వితో కలిసి మూడు నెలలుగా కామారెడ్డి మండలం గూడెంలోని తల్లిగారింటి వద్ద ఉంటోంది. మూడు రోజుల క్రితం స్వరూప తన కూతురితో కలిసి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోగా, కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పట్టణానికి చెందిన యువతి..

కామారెడ్డి పట్టణంలోని కాకతీయనగర్ కాలనీకి చెందిన కలిగుట సౌజన్య అనే యువతి అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. మండలంలోని షాబ్దిపూర్ గ్రామానికి చెందిన నర్సింలు కుటుంబం కొద్ది రోజులుగా కామారెడ్డిలో నివాసం ఉంటుండగా, ఆయన కుమార్తె సౌజన్య ఈ నెల 20న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో తండ్రి నర్సింలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జీజీహెచ్ నుంచి వృద్ధురాలు..

ఖలీల్‌వాడి: నగరంలోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బాల్కొండకు చెందిన గ్రామానికి చెందిన సకినా (60) అదృశ్యమైనట్లు ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. గర్భవతి అయిన తన కూతురిని డెలివరీ కోసం సకినా ఈనెల 2న జీజీహెచ్‌లో అడ్మిట్ చేసింది. 4వ తేదీన సాయంత్రం టీ తీసుకువస్తానని బయటికి వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

రాజంపేట : సైబర్ నేరస్తులతో జాగ్రత్తగా ఉండాలని రాజంపేట ఎస్సై సంపత్ పేర్కొన్నారు. ఆదివారం సమావేశంలో మాట్లాడారు. రైతుల రుణమాఫీ కావడంతో సైబర్ నేరస్తులు 'ఏపీకే' ఫైల్స్ పేరుతో, రైతుల రుణం మాఫీ అయ్యిందని వాట్సప్‌లో ఎస్సెమ్మెస్‌లు పంపుతున్నారని వాటిని ఓపెన్ చేయవద్దన్నారు. ఎవరైనా మోసానికి గురైతే 1930కు ఫోన్ చేయాలన్నారు.